క్లుప్తంగా

నేడు మండల సమావేశం

నాగులుప్పలపాడు: మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం ఉదయం 11 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నలమలపు అంజమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఏవీ కుమారి తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సొసైటీ అధ్యక్షులతో పాటు అన్ని శాఖల అధికారులు తగిన సమాచారంతో హాజరుకావాలని కోరారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సన్నద్ధం కావాలి

కొత్తపట్నం: ఈ నెల 13వ తేదీ ఎమ్మెల్సీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అధికారులందరూ సన్నద్ధం కావాలని కొత్తపట్నం తహసీల్దార్ బీవీ రమణారావు తెలిపారు. గురువారం మీడియాతో ఆయన మాట్లాడుతూ మండలంలోని 15 పంచాయతీల్లో ఎమ్మెల్సీ ఓట్లు 1,376, పట్టభద్రుల ఓట్లు 77 ఉన్నట్లు తెలిపారు. వారందరికీ కొత్తపట్నంలోని బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు బూత్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పట్టభద్రులకు బూత్ నంబర్ 37, గ్రాడ్యుయేట్లకు బూత్ నంబర్ 79/79ఏని సిద్ధం చేసినట్లు తెలిపారు. ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సాలార్‌కు బ్యాక్ బోన్ ఆఫ్ సీసీ అవార్డు



ప్రశంసపత్రాన్ని అందుకుంటున్న సాలార్

ఒంగోలు టౌన్: కర్నూలులో ఇటీవల నిర్వహించిన కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ 5వ జాతీయ సదస్సులో బ్యాక్ బోన్ ఆఫ్ సీసీ అవార్డుతో తనను సత్కరించినట్లు ఆ సంస్థ ప్రకాశం జిల్లా కో ఆర్డినేటర్ ఎంఏ సాలార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ బ్రహ్మారెడ్డి ఫంక్షన్ హాలులో సంస్థ వ్యవస్థాపకుడు మంచికట్ల అనిల్‌కుమార్ చేతుల మీదుగా ప్రశంసపత్రాన్ని అందుకున్నట్లు చెప్పారు.

వరిగడ్డి వామి దగ్ధం

దర్శి: మండలంలోని లంకోజనపల్లి సమీపంలో సీహెచ్ చిన్న బ్రహ్మయ్యకు చెందిన వరిగడ్డి వామి గురువారం దగ్ధమై రూ.20 వేల నష్టం జరిగింది. ట్రాక్టర్‌పై వరిగడ్డి తీసుకెళ్తుండగా పైన కరెంట్ తీగలు తగిలి మంట అంటుకుంది. స్థానికులు కేకలు వేయడంతో వెంటనే గడ్డిని కింద పడేసేందుకు ట్రాలీపైకి లేపాడు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. ట్రాక్టర్‌కు ఎటువంటి ఇబ్బంది కలగలేదు. సకాలంలో ఫైరింజన్ వచ్చి మంటలార్పింది.

పైపు లైన్లు ధ్వంసం

పెద్దదోర్నాల: గుర్తు తెలియని వ్యక్తుల దాడిలో ప్యానల్ బోర్డుతో పాటు నీటి సరఫరాకు సంబంధించిన పైపులైన్లు ధ్వంసం అయ్యాయని రామచంద్రకోటకు చెందిన పలువురు రైతులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామంలోని రైతు కర్రా మల్లారెడ్డి పొలంతో పాటు మరో ముగ్గురి పొలాల్లోని ప్యానెల్ బోర్డులు, పైపు లైన్లు ధ్వంసం చేసినట్లు ఫిర్యాదు అందటంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

సాగర్ నీటికి వారబందీ

అద్దంకి: నాగార్జున సాగర్ కుడి కాలవకు కేటాయించిన నీటికి ఈనెల 6వ తేదీ నుంచి వారబందీ విధానం అమలుచేయనుననట్లు సంతమాగులూరు డీఈ ఈశ్వర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దాని ప్రకారం ఆరో తేదీ నుంచి 11వ తేదీ వరకు ఆరు రోజులు కాలువకు నీటి సరఫరా నిలిపేస్తారు. 12వ తేదీ నుంచి 20వ తేదీ వరకు కాలువకు తిరిగి నీటి సరఫరా చేస్తారని తెలిపారు. రైతులు గమనించి నీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: శుభకృత్ నామ సంవత్సరం. ఉత్తరాయణం ఫాల్గుణ మాసం పునర్వసు నక్షత్రం ఏకాదశి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేస్తారని శింగరకొండ దేవస్థాన ఏసీ సుభద్ర గురువారం తెలిపారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

కన్నుల పండువగా వెంకటేశ్వర స్వామి కల్యాణం

కారంచేడు: మండలంలోని స్వర్ణ గ్రామంలో కొలువైన అలివేలు మంగా పద్మావతీ సమేత వెంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. గురువారం ఆలయ 47వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని వేకువజాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో విఘ్నేశ్వర పూజ, కంకణాల పూజల అనంతరం స్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు.

గ్రామంలోని 44 మంది దంపతులు కల్యాణంలో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఏపీఎస్ బ్రదర్స్ సహకారంతో ప్రత్యేక పూజల తరువాత తీర్థ, ప్రసాదాలు, ఆలయ కమిటీ సహకారంతో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పన్ను బకాయిలు చెల్లించాలి

- లేకుంటే ట్యాపు కనెక్షన్లు తొలగిస్తాం
- వేగవంతంగా సర్వేలు కూడా పూర్తి చేయాలి
- ప్రతి వార్డు సచివాలయంలో విధిగా చేపట్టాలి
- 35వ డివిజన్ సచివాలయాన్ని సందర్శించిన కమిషనర్ వెంకటేశ్వరరావు



సమీక్షిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు, కార్పొరేటర్, కార్పొరేషన్ అధికారులు

ఒంగోలు సబర్బన్: నగరంలోని ప్రజలు అన్ని రకాల పన్ను బకాయిలు సకాలంలో చెల్లించాలని ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు కోరారు. స్థానిక 35వ డివిజన్‌లోని లాయర్‌పేటలో స్థానిక కార్పొరేటర్ ఆదిపూడి గిరజా శంకర శాండిల్య, ఇతర నగరపాలక సంస్థ అధికారులతో కలిసి గురువారం కమిషనర్ పర్యటించారు. ఈ సందర్భంగా వారు ప్రతి ఇంటికి వెళ్లి బకాయి ఉన్న అన్ని రకాల పన్నులు చెల్లించాలని సూచించారు. సకాలంలో చెల్లించకపోతే మంచినీటి కుళాయి కనెక్షన్‌ను తొలగిస్తామని హెచ్చరించారు. అందులో భాగంగా లాయరుపేట సచివాలయం పరిధిలో కొన్ని మంచినీటి కుళాయిలను తొలగించారు. మార్చి నెలాఖరుకల్లా అన్ని రకాల పన్నులు వసూలు చేయాలని సచివాలయంలోని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం లాయరుపేట సచివాలయంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ లాయరుపేట సచివాలయం పరిధిలో మొత్తం 1160 అసైన్‌మెంట్లు ఇచ్చామని, వాటిలో 813 అసైన్‌మెంట్లను పూర్తి చేశారని, మిగతావి కూడా పూర్తి చేయాలని ప్లానింగ్ సెక్రటరీని ఆదేశించారు. సిబ్బంది ప్రతిరోజూ 25 సేవలకు తగ్గకుండా ప్రజలకు అందించాలని సూచించారు. కరెంటు బిల్లు కట్టడం, లామినేషన్ సర్వీసెస్, ప్రాపర్టీ, వాటర్ ట్యాక్స్, బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్లు సకాలంలో అందించాలన్నారు. సచివాలయ సిబ్బంది ఏకరూపు దుస్తులు తప్పనిసరిగా ధరించాలన్నారు. పీఎం–జేఏవై సర్వే పురోగతి గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి మంగళవారం కలెక్టర్ నిర్వహించే వీక్షణ సమావేశంలో పీఎంజేఏవై సర్వే పురోగతి గురించి ఆరా తీస్తున్నారన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్ను, కొళాయి పన్ను గురించి ప్రత్యేకంగా సచివాలయ సిబ్బంది, నగరపాలక సంస్థ రెవెన్యూ సిబ్బందితో చర్చించారు. లాయరుపేట సచివాలయ పరిధిలో పన్నులకు సంబంధించి మొత్తం డిమాండ్ సుమారు రూ.1,07,35,197 ఉండగా, రూ.76,51,359 వసూలు చేశారన్నారు. ఇంకా రూ.30,83,839 బకాయి ఉందన్నారు. సర్వేలకు సంబంధించి ఆర్‌డీఎంఏ ప్రతిరోజూ టెలీకాన్ఫరెన్స్‌లో పురోగతి గురించి ఆరా తీస్తున్నారని వెల్లడించారు. జగనన్న భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా చేపడుతున్న సర్వేను వేగంగా చేపట్టాలని, సర్వే సక్రమంగా పూర్తి కాకపోతే శాఖాపరమైన చర్యలకు కూడా ఉపేక్షించేది లేదని అన్నారు. సచివాలయం పరిధిలోని అభివృద్ధి పనులపై కూడా సమీక్షించారు. మంజూరై ప్రారంభించని పనులను వెంటనే ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. సర్వే విషయంలో వలంటీర్లు అందరూ సచివాలయ సిబ్బందికి సహకరించాలని చెప్పారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఏసీపీ కే వెంకటేశ్వర్లు, ఎంఈ కే మాల్యాద్రి, శానిటరీ సూపర్‌వైజర్ ఎన్.పిచ్చయ్య, డీఈ గణపతి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ బాబ్జి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మిరియాల శ్రీనివాసులు, సాయి చంద్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన జోనల్ ఆఫీసర్



పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న జోనల్ ఆఫీసర్ శ్రీనివాసప్రసాద్, ఎంసీసీ టీమ్ సభ్యులు

మద్దిపాడు: స్థానిక కడియాల యానాదయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ సభ్యులతో కలిసి జోనల్ అధికారి శ్రీనివాస ప్రసాద్ గురువారం మధ్యాహ్నం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రంలో మౌలిక వసతులను పరిశీలించి పోలింగ్ సమయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని తహసీల్దార్ లక్ష్మీనారాయణకు సూచించారు. మండలంలో పట్టభద్రుల ఓటర్లు మొత్తం 1,346 మంది ఉండగా, వారిలో 936 మంది పురుషులు, 410 మంది మహిళలు ఉన్నట్లు తెలిపారు. ఉపాధ్యాయుల నియోజకవర్గానికి సంబంధించి మండలంలో 91 మంది ఓటర్లున్నారని, వారిలో 70 మంది పురుషులు, 21 మంది మహిళలు ఉన్నారని వెల్లడించారు. పట్టభద్రుల ఓటర్లు 58, 58ఏ పోలింగ్ బూత్‌లలో, ఉపాధ్యాయ నియోజకవర్గ ఓటర్లు 33వ నంబర్ పోలింగ్ బూత్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ తెలిపారు. పోలింగ్ సిబ్బందికి అవసరమైన వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. ముందుగా తహసీల్దార్ కార్యాలయంలో ఎంసీసీ సభ్యులకు ఏర్పాటు చేసిన సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల నియమావళికి సంబంధించిన నిబంధనలు ఉల్లంఘించకుండా గ్రామ సచివాలయాలు, ఇతర ప్రభుత్వ సంస్థలలో నిరంతరం పర్యవేక్షించాలని ఎస్సై శ్రీరామ్, ఏవో సుబ్బారావు, ఎంఈవో ఎంవీఆర్ ఆంజనేయులుకు సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు ఇబ్బందులు కలిగించకుండా ప్రచారం నిర్వహించుకోవాలని అభ్యర్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ఉపాధ్యాయుడు పెద్దిరెడ్డి కోటిరెడ్డి, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డేవిడ్ పాల్గొన్నారు.

పూర్తిస్థాయి యూనివర్సిటీ ఏర్పాటుకు వినతి



వీసీని కలిసి వినతిపత్రం అందజేస్తున్న జేవీవీ నాయకులు

ఒంగోలు టౌన్: పూర్తిస్థాయి యూనివర్సిటీ, సైన్స్ సెంటర్, ప్లానిటోరియం ఏర్పాటు చేయాలని కోరుతూ జనవిజ్ఞాన వేదిక నాయకులు గురువారం వైస్ చాన్సిలర్ మారం అంజిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. యూనివర్సిటీలో తెలుగు శాఖ, అకడమిక్ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలని, నేషనల్ యూనివర్సిటీ క్రీడలకు అన్ని వసతులతో కూడిన స్టేడియం నిర్మించాలని కోరారు. స్పందించిన వైస్ చాన్సిలర్ అంజిరెడ్డి వివిధ శాఖల ఏర్పాటు, నిర్మాణాల గురించి ప్రభుత్వంతో చర్చించి త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. తొలుత వైస్ చాన్సిలర్‌గా బాధ్యతలు చేపట్టిన అంజిరెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి, కొల్లా మధు, కంచర్ల వెంకటేశ్వర్లు, చిన్నాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను రక్షించుకుందాం



విద్యార్థినులతో మాట్లాడుతున్న డాక్టర్ మానస, సిబ్బంది

మద్దిపాడు: ఆడపిల్లలను రక్షించుకుందామని, మగపిల్లలతో సమానంగా చదివిద్దామని డాక్టర్ మానస అన్నారు. మండలంలోని గుండ్లాపల్లి వెల్‌నెస్ సెంటర్‌లో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలపై వివక్ష లేకుండా చూడాలని, వారికి మంచి విద్య, వైద్యం అందించాలని ప్రభుత్వం చెబుతోందన్నారు. బిడ్డ గర్భంలో ఉన్నప్పుడే ఆడా.. మగా..? అనే పరీక్షలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. ఆ విధంగా ఎవరైనా పరీక్షలు నిర్వహిస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు జైలు శిక్ష కూడా ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. విలేజ్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేసుకోవడానికి సహకరించిన లింగా రామకృష్ణారెడ్డికి, ఎంపీటీసీ పద్మకు, సర్పంచ్ కొప్పోలు ఆంజనేయులుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, సీహెచ్‌వో కీర్తి, ఏఎన్‌ఎం రంజాన్‌బీ, శిరీష, ఆశా వర్కర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థుల ప్రభంజనం

ఒంగోలు: జేఈఈ మెయిన్స్ (బీ ఆర్క్) ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని శ్రీ సరస్వతీ విద్యాసంస్థల చైర్మన్ ఏవీ రమణారెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక మంగమూరు రోడ్డులోని కాలేజీ ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుమ్మా నితిన్‌రెడ్డి 98.41 పర్సంటైల్‌తో, గంగవరపు మధుమతి 97.39 పర్సంటైల్‌తో రాణించారన్నారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్లు ఎ.గణేష్‌రెడ్డి, ఎ.గంగా శంకరరెడ్డి, సీఈవో ఎన్‌వీ సురేష్, డీన్లు, ప్రిన్సిపాళ్లు పాల్గొని మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

ఆర్థిక అక్షరాస్యత అవసరం

నాగులుప్పలపాడు: ప్రస్తుత ఆధునిక సాంకేతిక యుగంలో బ్యాంకు ఖాతా కలిగిన ప్రతి వ్యక్తి ఆర్థిక అక్షరాస్యతతో పాటు గోప్యత కలిగి ఉండటం చాలా అవసరమని నాగులుప్పలపాడు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు శాఖ మేనేజర్ కిషోర్‌రెడ్డి సూచించారు. చింతాయగారిపాలెం గ్రామంలో బుధవారం రాత్రి బ్యాంకు ఖాతాదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి పలు సలహాలు, సూచనలు చేశారు. అపరిచిత వ్యక్తులతో బ్యాంకు లావాదేవీల గురించి చర్చించకుండా కేవలం బ్యాంకు సిబ్బందితోనే చర్చించాలని సూచించారు. నెట్ బ్యాంకింగ్‌తో సేవలను సులభతరం చేసుకోవచ్చన్నారు. కళాకారులతో అవగాహన జాతా నిర్వహించారు.

గ్యాస్ ధర పెంచడం దారుణం

ఒంగోలు టౌన్: అసలే నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయి సామాన్యప్రజలు అల్లాడుతుంటే.. కేంద్ర ప్రభుత్వం మరోసారి వంట గ్యాస్ ధరను రూ.50 పెంచడం దారుణమని ఆవాజ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ యాసిన్, ఎంఎస్ బేగ్ గురువారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పడే నాటికి రూ.460 ఉన్న గ్యాస్ సిలిండర్ ధరను ఇప్పుడు ఏకంగా రూ.1,160 వరకు పెంచడం నిరుపేదల నడ్డివిరగ్గొట్టడమే అని ఆవేదన వ్యక్తం చేశారు. శతకోటీశ్వరులకు లక్షల కోట్ల రూపాయల రాయితీలిస్తూ, ఒంటిచేత్తో వారి బ్యాంకు రుణాలను మాఫీ చేస్తూ పేదలపై పెనుభారాలు మోపడం అమానుష చర్యగా అభివర్ణించారు. మార్చి 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ కానుకగా మహిళల కంట్లో కారం కొట్టి కన్నీళ్లు తెప్పిస్తున్నారని విమర్శించారు.

మోదీ పాలనలో ప్రపంచంలోనే అత్యధిక ధరకు వంట గ్యాస్ సిలిండర్‌ను విక్రయిస్తున్న దేశంగా మన దేశం నిలిచిందని, అస్తవ్యస్త విధానాలతో దేశ ప్రజల సంపదను ధనవంతులకు కట్టబెడుతున్నారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పేందుకు వేచి చూస్తున్నారన్నారు.

శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం

ముండ్లమూరు: మండలంలోని కెల్లంపల్లి రైతు భరోసా కేంద్రంలో గురువారం మండల వ్యవసాయాధికారి మేరమ్మ శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో రైతులకు కనీస మద్దతు ధర కల్పించాలని లక్ష్యంతో మండలంలో శనగల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పసుపుగల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఈ కేంద్రంలో మండలంలోని రైతులందరూ శనగలు అమ్ముకోవచ్చన్నారు. పసుపుగల్లు సొసైటీ అధ్యక్షుడు కుమ్మిత వెంకటరెడ్డి, సీఈఓ వీరవెంకట నరసయ్య పాల్గొన్నారు.

నిబద్ధత గల నాయకుడు.. బిరుదల



రమేష్ అంత్యక్రియల్లో పాల్గొన్న మంద కృష్ణ

ఒంగోలు టౌన్: తొలి నుంచి మాదిగ జాతి కోసం నిబద్ధతగా పోరాడిన నాయకుడు బిరుదల రమేష్ మృతి మాదిగ ఉద్యమానికి తీరని లోటని మహాజన నేత మంద కృష్ణమాదిగ అన్నారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా కార్యదర్శిగా క్రియాశీలకంగా పనిచేసిన సంతనూతలపాడు నియోజకవర్గంలోని మద్దలూరు గ్రామ మాజీ సర్పంచ్ బిరుదల రమేష్ బుధవారం రాత్రి గుండెపోటుతో మరణించారు. స్థానిక మంగమూరుడొంకలోని శివప్రసాద్‌కాలనీలో ఆయన సోదరుడి ఇంటి వద్ద గురువారం నిర్వహించిన అంత్యక్రియలకు హాజరైన మందకృష్ణ.. నివాళి అర్పించారు. రమేష్ అకాల మరణం తనను ఎంతగానో బాధించిందన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

మార్కాపురం టౌన్: గర్భిణులుగా ఉన్న మహిళలకు లింగ నిర్ధారణ పరీక్షలు చేసి పుట్టబోయే బిడ్డ ఆడ, మగ అని తెలుసుకోవటం నేరమని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రాహుల్ అన్నారు. గురువారం ఆయన జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో భేటీ బచావో– భేటీ పఢావో కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు జరిగిన అవగాహన కార్యక్రమంలో ప్రసంగించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన వారికి మూడు నుంచి ఐదేళ్ల జైలుశిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తారని హెచ్చరించారు. ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, పట్టణ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దీపిక మంజూష, డాక్టర్ రాజశేఖర్, ఉపాధ్యాయురాలు ఆర్ఎం ఝాన్సీపాల్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

- జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్



కేజీబీవీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఈఓ రమేష్

కొనకనమిట్ల: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధితో పాటు విద్యార్థుల విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని జిల్లా విద్యాశాఖ అధికారి పిల్లి రమేష్ తెలిపారు. గురువారం ఆయన మండలంలోని గొట్లగట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల, కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను ఎంఈఓ దాంగే షరీఫ్‌తో కలిసి ఆయన సందర్శించారు. తొలుత జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి కుకింగ్ ఏజెన్సీలతో మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలన్నారు. భోజనాన్ని రుచి చూసి సూచనలు, సలహాలందించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ప్రభుత్వ సూచనల మేరకు విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహించి మంచి ఫలితాలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని హెచ్ఎం వీరాస్వామికి సూచించారు. అనంతరం కేజీబీవీని సందర్శించారు. రికార్డులు పరిశీలించి బాలికలు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలల్లో నాడు–నేడు ద్వారా ప్రభుత్వం అన్ని రకాల మౌలిక వసతులు కలిపిస్తోందన్నారు. నాడు–నేడు ద్వారా పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, లైబ్రరీని, పాఠశాల గదులు, వాటర్ ప్లాంట్, నూతనంగా ఏర్పాటు చేసిన టాయ్‌లెట్ గదులను పరిశీలిచి డీఈఓ రమేష్ సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలోని రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్ఎం వీరాస్వామి, కేజీబీవీ ప్రిన్సిపాల్ సురేఖ ఉన్నారు.

శాస్త్రవేత్తల సేవలు రైతులకు చేరువ కావాలి



నువ్వుల విత్తనాలు పంపిణీ చేస్తున్న షేక్ ఎన్.మీరా

దర్శి: శాస్త్రవేత్తల సేవలను రైతులకు మరింత చేరువ చేయాలని ఐకార్ అటారీ డైరెక్టర్ షేక్ ఎన్.మీరా సూచించారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. దేశంలోని ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లోని అన్నీ కృషి విజ్ఞాన కేంద్రాలకు అధిపతిగా ఫిబ్రవరి 14న ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆ తర్వాత షేక్ ఎన్.మీరా తొలిసారిగా దర్శి కేవీకేను సందర్శించడంతో ఆయనకు శాస్త్రవేత్తలు ఘన స్వాగతం పలికారు. మీరా దర్శి కేవీకేలో చేపడుతున్న వివిధ కార్యక్రమాలు, సమన్వయకర్తల ద్వారా అడిగి తెలుసుకున్నారు. కేవీకేలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను పర్యవేక్షించారు. మీరా మాట్లాడుతూ రైతులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ ఇవ్వాలని సూచించారు. రైతులకు ఆర్థిక అభివృద్ధికి దోహదపడే వృత్తి విద్యా శిక్షణ కార్యక్రమాలపై మక్కువ చూపాలని ఆదేశించారు. సీఎఫ్‌ఎల్‌డీ కింద నువ్వుల విత్తనాలను రైతులకు అందజేశారు. శాస్త్రవేత్తలు డాక్టర్ సీహెచ్ వరప్రసాద్, డాక్టర్ జి.రమేష్, జీఎస్‌ఓ ఉషా, జాహ్నవి, వెంకటేశ్వరరెడ్డి, లీలాకృష్ణ, కాశీవిశ్వనాథ్, శివ, మానస పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డి

పెద్దారవీడు: తూర్పు రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎన్నికల నేపథ్యంలో మండలంలో ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల్లో ఎన్నికల నియమావళిని ఉల్లఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో గురువారం మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాల్లో రాజకీయ నాయకులు ప్రచారం చేయకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో రాజకీయ నాయకులు ఎటువంటి అనుమతి పొందకుండా సమావేశాలు, ర్యాలీలు నిర్వహించవద్దని, ఎన్నికల నియమావళి ప్రతి ఒక్కరూ తప్పకుండా పాటించాలని సూచించారు. ఎంపీడీఓ రాజ్‌కుమార్, ఏఓ కె. బుజ్జిబాయి, డాక్టర్ వెంకటేశ్వరరావు, వెటర్నరీ డాక్టర్ బాలునాయక్, వీఆర్వోలు, పీఎస్‌లు పాల్గొన్నారు.

పాఠశాలకు స్థలం చూపాలి



ఆర్డీఓతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ నాగిరెడ్డి

కురిచేడు: మండలంలోని పడమర నాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్మాణానికి స్థలం చూపాలని జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి కనిగిరి ఆర్డీ ఓ సందీప్‌కుమార్‌ను కోరారు. మండలంలోని పలు అంశాలపై పరిశీలనకు వచ్చిన ఆయన్ను తహసీల్దార్ కార్యాలయలో కలిసి మాట్లాడారు. పాఠశాలకు నిధులు మంజూరై ఉన్నాయని తెలిపారు. కేవలం స్థలం లేకపోవడంతో పాఠశాల నిర్మాణం నిలిచిపోయిందని పేర్కొన్నారు. సానుకూలంగా స్పందించిన ఆయన పమరనాయుడు వెళ్లి స్థలాలు పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని ఆర్డీఓ హామీ ఇచ్చారు. పోలింగ్ స్టేషన్లను పరిశీలించి ఎన్నికలకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అధికారులకు తగు సూచనలు, సలహాలిచ్చారు. ఆయన వెంట తహసీల్దార్ నాగూల్‌మీరా, ఎంఈఓ ఆర్.వస్త్రాంనాయక్, డీటీలు శ్రీకాంత్, రాధాకృష్ణ, ఇన్‌చార్జి ఆర్ఐ సీహెచ్ వెంకటేశ్వరరావు, ఉన్నారు.

నిధులు దుర్వినియోగం



విచారణ చేస్తున్న డీఎల్‌పీఓ శోభన్‌బాబు

కురిచేడు: స్థానిక గ్రామ పంచాయతీలో స్వీపర్‌గా పనిచేసిన కంభంపాటి కోటయ్య ఉద్యోగ విరమణ తర్వాత పింఛన్ కాంట్రిబ్యూషన్ డ్రాచేసిన నిధులు దుర్వినియోగమైనట్లు డివిజనల్ పంచాయతీ అధికారి జి.శోభన్‌బాబు నిర్ధారించారు. జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు ఆయన స్థానిక పంచాయతీలోని రికార్డులను గురువారం పరిశీలించారు. సీఎఫ్‌ఎంఎస్ ఖాతా నుంచి రూ.4.31 లక్షలు గతేడాది మార్చి 15వ తేదీన గ్రామ పంచాయతీలోని వాటర్‌ప్లాంటు ఖాతాకు బదిలీ చేశారు. ఆ ఖాతా నుంచి డేటా ఎంట్రీ ఆపరేటర్‌తో కార్యదర్శి నిధులు డ్రా చేయించి స్వాహా చేసినట్లు తన విచారణలో తేలిందని డీఎల్‌పీఓ తెలిపారు. ఆ నిధులు జిల్లా పరిషత్ కార్యాలయానికి చలానా ద్వారా చెల్లించాల్సి ఉండగా నేటి వరకూ ఆ నిధులు చెల్లించలేదని పేర్కొన్నారు. త్వరలో వాటర్‌ప్లాంట్ నిధులు కూడా పరిశీలించి ఆ నిధులపై నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు ఇవ్వనున్నట్లు చెప్పారు.

విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న జువాలజీ అధ్యాపకుడు సుబ్బారెడ్డి

పెద్దారవీడు: విద్యార్థులు తం సామర్థ్యాలను ఉపయోగించుకొని మంచి ఫలితాలు సాధించాలని దోర్నాల ప్రభుత్వ జూనియర్ కళాశాల జువాలజీ అధ్యాపకులు కేవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ షేక్ మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో నాలుగో వార్షికోత్సవం గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎన్నో ప్రయాసలకు ఓర్చి పిల్లలను చదివిస్తారని, ప్రతి ఒక్కరూ మదిలో పెట్టుకొని క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. స్థానికులు కాసు వెంకటరెడ్డి, వి. ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీలకు సాగు భూములివ్వాలి

కురిచేడు: భూమిలేని ఎస్సీలకు నూతనంగా నిర్వహించే అసైన్‌మెంట్ కమిటీ ద్వారా సాగుభూములు ఇవ్వాలని ఎస్సీ కాలనీకి చెందిన జోసఫ్.. ఆర్డీ ఓ సందీప్‌కుమార్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. రీ సర్వేలో గుర్తించిన ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలని కోరాడు.